www.prajasakti.com
ప్రజాశక్తి



'గడప గడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రాష్ట్ర ప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ఏకైక లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గో వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఈదూరు పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగింది. వైసిపి మాజీ కన్వీనర్ బంగుబూరు పద్మనాభ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభి వృద్ధి రెండు కళ్లతో సమాన మన్నారు. వైసిపి నాయకులు కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వ ర్ణలత, జనసాక రమేష్ రెడ్డి, జెడ్పిటిసి శేషమ్మ, తలమంచి సురేంద్ర బాబు, మోచర్ల మ ధు, కోడూరు దిలీప్ కుమార్ రెడ్డి, టి. సురేష్ రెడ్డి, మాజీ జె డ్పిటిసి చిరంజీవి గౌడ్, ఎంపీ డీఓ కన్నం హేమలత, తహశీల్దార్ ర్ శివయ్య ఉన్నారు.

జ'గన్' మార్కు 'రాజీ'కీయం..!

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తొలిసారి తన మార్కు రాజకీయాలకు పదునుపెట్టారు. ఏ విషయాలను పెద్దగా పట్టించుకోకుండా ఉంటారనే ప్రచారం ఉన్న సమయంలో శుక్రవారం కావలి సభకు వచ్చిన ఆయన జిల్లాలోని రాజకీయ పరిస్థితులు చక్కదిద్దటానికి సిద్ధమయ్యారు. నెల్లూరు నగరంలో నేనంటే..నేను అంటూ గొడవలు పడుతున్నారు.బాబాయ్, అబ్బాయ్ రూప్‌కుమార్‌యాదవ్, అనిల్‌కుమార్‌తో చేతులు కలిపారు. కలిసి పనిచేయాలని ఆదేశించారు. ఉదయగిరి అభ్యర్థిగా సిఎం ఆరా తీశారు. మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేరును ఆ ప్రాంత నేతలు ఏకపక్షంగా తెలిపినట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో ఈ విషయాన్ని ఫైనల్ చేస్తానని జగన్ చెప్పినట్లు సమాచారం. కావలి ఎంఎల్‌ఎపై వస్తున్న విమర్శలపైనా సిఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. మొత్తంగా జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా రాజకీయాలపై దృష్టిపెట్టినట్లు తెలిసింది.

- అనిల్, రూప్‌ని కలిపిన సిఎం
- ఇద్దరు కలిసి పనిచేయాలని ఆదేశం
- ఉదయగిరి 'మెట్టుకూరు'కు ఇవ్వాలన్న నేతలు
- కావలి ఎంఎల్‌ఎపై అసంతృప్తి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపి జిల్లాలో గడ్డుపరిస్థితులు ఎదుర్కొంటుంది. ఇప్పటికే ముగ్గురు ఎంఎల్‌ఎలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితోపాటు కావలి నేత మల్లెమాల సుకుమార్‌రెడ్డిలను వైసిపి పక్కన పెట్టింది. ఉమ్మడి 10 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు స్థానాల్లో ఇబ్బందులు పడుతోంది. ఇవి కాకుండా నెల్లూరు నగరంలో ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్‌యాదవ్, ఆయన బాబాయ్: డిప్యూటీ మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, ముఖ్యల ద్వారకానాథ్ మధ్య తీవ్ర స్థాయిలో విభేదాలున్నాయి. గూడూరు నియోజకవర్గంలోనూ గ్రూపుల బెడద ఉంది. సర్వేపల్లి, కోవూరు నియోజకవర్గాల నుంచి మాత్రమే పార్టీలో విభేదాలు కనిపించడం లేదు. జిల్లాలో నెలకొన్న పార్టీ విభేదాలు గురించి ఇప్పటి వరకు పెద్దగా ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదని ఆపార్టీ నేతలంటున్నారు. ఇదిలా ఉంటే శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలిలో జరిగిన "చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం" సభ జరిగింది. గతం కంటే ముఖ్యమంత్రి ప్రసంగంలోనూ, ప్రవర్తనలోనూ మార్పు కనిపిస్తోంది. ఎక్కడ బహిరంగసభలోనూ 10 నుంచి 15 నిమిషాలు మాత్రమే మాట్లాడే జగన్‌మోహన్‌రెడ్డి కావలి సభలో 40 నిమిషాల వరకు మాట్లాడారు. ప్రజలకు అర్థమయ్యేలా రాజకీయ ప్రసంగం చేశారు. ప్రజలు కొత్త జగన్‌మోహన్‌రెడ్డిని చూశారు. అందరితో కలివిడిగా మాట్లాడారు. నేతలను పేరు పేరునా పలకరించారు.

అనిల్, రూప్‌ను కలిపిన జగన్..!

నెల్లూరు నగరంలో ఎంఎల్‌ఎ అనిల్‌కుమార్‌యాదవ్, రూప్‌కుమార్ యాదవ్ మధ్య వచ్చిన్న విభేదాలు భగ్గుమంటుంది. జిల్లా నేతలు ఎవరూ వారిని సమన్వయం చేయడానికి ప్రయత్నాలు చేయలేదు. అది సాధ్యం కాదని నేతలు మౌనంగా ఉన్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసు కుంటున్నారు. ఈ క్రమంలో కావలిలో ఉన్నత పాఠశాల హెలిప్యాడ్ వద్ద ఆసక్తికర సంఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. రూప్, అనిల్‌కు ఇద్దరిని పలకరించి, దగ్గరకు తీశారు. ఒకరి చేతిని మరొకరి చేతిలో కలిపారు. ఇద్దరు కలిసి పనిచేయాలని ఆదేశించారు. "రూప్ గొడవలుంటే పక్కన పెట్టండి. అనిల్‌ను గెలిపించుకుని రావాలి" అని చెప్పినట్లు సమాచారం. ఇద్దరు నేతలు ఎడముఖం పెడముఖంలా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రే స్వయంగా పిలిచి మాట్లాడంతో మౌనంగా ఉండిపోయారని తెలిసింది. దీనిని సిఎం కార్యాలయ ఫొటో గ్రాఫర్ ఫొటోలు తీసినా మీడియాకు రిలీజ్ చేయలేదు. సిఎం వెళ్లిన వెంటనే ఎవరి దారిలో వారు వెళ్లిపోయారు. సిఎం చేసిన ప్రయత్నం ఫలిస్తుందా ? లేదా ? చూడాలి..

సిఎం జగన్మోహన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న అనిల్‌కుమార్

సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రూప్‌కుమార్ యాదవ్

ఉదయగిరి నేతలతో సిఎం మాటా మంతి..!

ఉదయగిరి ఎంఎల్‌ఎ టికెట్ కోసం వైసిపి తీవ్ర పోటీ నెలకొంది. ఇప్పటికే మేకపాటి కుటుంబం నుంచి ఎవరో ఒకరు వస్తారని ప్రచారం సాగుతోంది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాజమోహన్‌రెడ్డి చిన్న తమ్ముడు మేకపాటి రాజారెడ్డి ఉదయగిరి నుంచి పోటీకి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కావలిలో ముఖ్యమంత్రితో హెలిప్యాడ్ వద్ద ఉదయగిరి నేతలు కలిశారు. ఉదయగిరి నేతలు మాజీ జెడ్‌పిటిసి అబ్బూరు రాజు ముఖ్యమంత్రి వద్ద గట్టిగా చెప్పినట్లు తెలిసింది. మేకపాటి కుటుంబం తప్ప ఎవరైనా మాకు పర్వాలేదంటూ చెప్పారని తెలిసింది. ఆ ప్రాంత నేతలు పాముల రమణయ్య, చేజర్ల చలమారెడ్డి, ఎ.ఓబుల్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలను సిఎం తమ అభిప్రాయం అడిగినట్లు తెలిసింది. అందరూ మెట్టుకూరు ధనుంజయరెడ్డి పేరును ముక్తకంఠంతో చెప్పారని సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో ఉదయగిరి విషయం ఫైనల్ చేస్తానని మాట ఇచ్చినట్లు తెలిసింది. ఆత్మకూరు ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి విదేశాలకు వెళ్లడంతో సిఎం సభకు రాలేదు. మేకపాటి రాజమోహన్‌రెడ్డికి ఆహ్వానం అందలేదని తెలిసింది.

కావలి ఎంఎల్‌ఎపై అసంతృప్తి..!

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలి సభ విజయవంతంగా జరిగింది. భారీ జన సమీకరణ చేశారు. ఇదే సమయంలో కావలి ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అవినీతి, అక్రమాలపై పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. మల్లెమాల సుకుమార్‌రెడ్డిని ఇదే విషయంపై పార్టీ నుంచి సస్పెండ్‌చేశారు. సిఎం రాక సందర్భంగా కావలి అభివృద్ధి నేతలు రెండు రోజుల క్రితమే మీడియా సమావేశం ఏర్పాటుచేసి, సిఎం సభను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం ఇంటిలిజెన్స్ ద్వారా సిఎంకు సమాచారం ఉన్నట్లు తెలిసింది. ఇదే సమయంలో కావలిలో బిజెపి నేతలు సిఎం కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. పోలీసు లాఠీఛార్జ్, పోలీసు అతి ప్రవర్తన అంతా సోషల్ మీడియాలో వచ్చింది. ఈ క్రమంలో కావలి ఎంఎల్‌ఎ తీరుపట్ల అసంతృప్తి వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఇలాంటి చిల్లరపనులు ఎందుకంటూ అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. భారీ బహిరంగ సభలో కావలి ఎంఎల్‌ఎని గెలిపించాలని ఎక్కడా ప్రస్తావించలేదు. ఇప్పుడు అక్కడ విషయం చక్కర్లు కొడుతోంది. జగన్ మార్కు రాజకీయం ఎలా సాగుతుందో చూడాలి.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు రూరల్ : ప్రపంచ స్థాయిలో దేశ కీర్తిని చాటని మహిళా రెజ్లర్లను లైంగిక వేధింపులకు గురిచేసిన డబ్ల్యూ ఎఫ్ఐ చైర్మన్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ఐద్వా, డివైఎఫ్ఐ, ఆవాజ్, ఎస్ఎఫ్ఐ తదితర ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఐద్వా, డివైఎఫ్ఐ, ఆవాజ్, ఎస్ఎఫ్ఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుండి విఆర్‌సి సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ కార్యదర్శి నరసింహ, ఐద్వా నగర కార్యదర్శి పద్మ ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రెజ్లర్లను లైంగికంగా వేధించిన బ్రిజ్ భూషణ్ ని తక్షణమే అరెస్టు చేసి క్రీడాకారుల్లో మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. రెజ్లింగ్ క్రీడా పోటీల్లో ప్రపంచ దేశాలకు చెందిన క్రీడా కారులతో వీరోచితంగా పోరాడి బంగారు పథకాన్ని కైవసం చేసుకొని ప్రపంచ దేశాల సరసన భారత దేశాన్ని నిలిపిన రెజ్లర్లకు వెన్నుతట్టి ప్రోత్సహించాల్సింది పోయి ఇటువంటి చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్నారు. బిజెపి ఎంపిలు ఒక వైపు భరతమాతకు జేజలు అంటూ మరో వైపు రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేసి శిక్షించాలన్నారు. డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ ఐద్వా అవాజ్ నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

'ఉపాధి' కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ

15న కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి -నెల్లూరు రూరల్ : ఉపాధి హామీ చట్టం పరిరక్షణ ఈ నెల15వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం రూరల్ మండల కమిటీ నాయకులు పేర్కొన్నారు. శనివారం డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సిపిఎం రూరల్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. శ్రీపతి వెంకయ్య అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ ఉపాధి హామీ పనిలో రెండు పూటలా పని పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పిం చాలన్నారు. రూ. 600 లు వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై 15వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో మండలంలోని ఉపాధి కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈనెల 19వ తేదీ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి ,ఈనెల 29వ తేదీ జక్కా వెంకన్న వర్ధంతి కార్యక్రమాలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం నెల్లూరు రూరల్ మండల నాయకులు జాన లక్ష్మీ ప్రసాద్, పర్చూరు ప్రభాకర్ , అట్లా అనిల్ ఎస్కే అమీర్ భాష, గుంటి. నాగరాజు, శ్రీపతి దయాకర్, కిరణ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జే వెంకమ రాజు, నక్క రాధయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1923 కేసులు పరిష్కరించారు.63 క్రిమినల్ కేసులు, 6 అమలు పిటిషన్ కేసులు, మూడు వివాహ సంబంధ కేసులు, ఒక చెక్కు బౌన్స్ కేసు, 7 సివిల్ కేసులు ,43 అడ్మిషన్ల కేసులు, 1800 పెట్టి కేసులను కలిపి మొత్తం 1923 కేసులను పరిష్కరించారు. ఈ లోక్ అదాల త్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎన్ విజయబాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేశంశెట్టి రమేష్ ప్రొసీడింగ్ ఆఫీసర్లుగా వ్యవహరించారు. లోక్ అదాలత్‌లో సభ్యులు న్యాయ వాదులు బివి శేషయ్య, బి వెంకటేశ్వర్లు, ఎస్ కే షషుద్దీన్, సిహెచ్ హరికృష్ణ వ్యవ హరిం చారు. న్యాయవాదులు వై సాంబశివరావు, హరికోటేశ్వరరావు,శ్రీధర్ నాయుడు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై కొరవడిన నిఘా

ప్రజాశక్తి - గుడ్లూరు : గుడ్లూరు మండలంలో కర్లపాలెం గుడ్లూరు తోపాటు మరికొన్ని ప్రాంతాల్లో పేకాట జూదం గుట్టుగా సాగుతోంది. పేకాట ఆడుతున్నట్లు తెలిసినపా స్థానిక పోలీసులు పట్టిం చుకోవడంలేదని ఆయా గ్రామాల్లోని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనేక కుటుం బాలకు చెందిన వారు డబ్బులు పోగొట్టుకొని నష్టపోతున్నారని, ఈ జోధాన్ని అరికట్టాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో మరింత విస్తరించే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా పేకాట జూదం నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -కందుకూరు : మండలంలోని పందలపాడు గ్రామంలో జాషువా యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లాస్థాయి సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ శనివారం ఉదయం జనార్ధన కాలనీ టీమ్, నందనవనం టీమ్ మధ్య జరిగిన పోటీలో జనార్ధన్ కాలనీ టీమ్ విజేతగా నిలిచింది. సల్మాన్ (మహి)మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. సల్మాన్‌కి మాన్ అఫ్ ది మ్యాచ్ వర్ల మహేంద్ర బాబు, పిల్లిపోగు జయకుమార్, నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే చేతుల మీదుగా అందజేశారు. అంపైర్లుగా వర్ల కోటయ్య, వర్ల రాజేష్ బాబు వ్యవహరించారు.

మధ్యాహ్నం కొత్త శింగరబొట్లపాలెం టీమ్, గంగపాలెం టీమ్ మధ్య జరిగిన మ్యాచ్లో గంగపాలెం టీమ్ విజేతగా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా చెన్నయ్య ఎంపికయ్యారు. చెన్నయ్యకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ కన్నెదారి నాగభూషణం, నెల్లూరు పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, పిల్లిపోగు జయ టకుమార్ చేతులమీదుగా అందజేశారు. గౌడపేరు కార్తీక్ స్కోర్ బోర్డు నిర్వహించారు. అంపైర్లుగా వర్ల రాజా, వర్ల కిషోర్ బాబు వ్యవహరించారని నిర్వాహకులు వర్ల కోటి, వర్ల రాజా, వర్ల కిషోర్ బాబు తెలిపారు.

గ్రూప్ -4 ఉద్యోగానికి స్వప్న ఎంపిక

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని ముత్యాల పాడు పంచాయితీలోని ముత్తా వారిపాలెం గ్రామానికి చెందిన విఘ్నేశ్వర మిల్క్ డైరీ డైరక్టర్ బొల్లినేని నరసింహారావు కుమార్తె బొల్లినేని స్వప్న గ్రూపు-4 ఉద్యోగం సాధించింది. జిల్లాలో 16 ర్యాంక్ సాధించిన స్వప్న గ్రూపు-1కి సిద్ధమ వుతోంది. ఈపాటికే ప్రిలిమ్స్ పరీక్ష రాసిన స్వప్న జూన్ నెలల్లో జరిగే మొయిన్స్ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతోంది. గ్రూపు-4 ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు .గ్రామస్తులు, బంధువులు శు భాకాంక్షలు తెలిపారు. తన కూతురు అనుకున్న లక్ష్యం వైపు వెళ్లేందుకు అన్నివిధాలుగా సహకారం అందిస్తానని నరసింహారావు చెప్పారు.

బొల్లినేని స్వప్న

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి -కందుకూరు : కందుకూరు నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకలలో శనివారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్, సోదరుడు ఇంటూరి రమేష్ హాజరైయరు. ఇంటూరి రాజేష్, రమేష్ నూతన వధూవరులను ఆశీర్వదించారు.

మహిళా రెజ్లర్లకు మద్దతు

ప్రజాశక్తి-నెల్లూరు రూరల్ : సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో నగరంలో ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో మహిళా రెజ్లర్లను ను లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి, డబ్ల్యూఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలంటూ కరపత్రాల పంపిణీ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళా క్రీడాకారులను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న బిజెపి ఎంపి పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ న్యాయవాది, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాగేంద్ర సాయి, జిల్లా సమితి సభ్యులు వాటంబేటి నాగేంద్ర, ఆదినారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏ. ఐ. టి. యు. సి) జిల్లా కార్యదర్శి షేక్. ముక్తియా ర్, సి. పి. ఐ నగర నాయకులు కె. స్టాలిన్, ప్రత్యూష్, అజయ్ బాబు,బట్టా శ్రీనివాసులు, కేశవరావు, షేక్. మస్తాన్,కే.రమేష్, మురళి ఉన్నారు.

మాలకొండకు పోటెత్తిన జనం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. పది, ఇంటర్ ఫలితాలు విడుదల కావడం, విద్యార్థులకు సెలవుల నేపథ్యంలో ఎండలను సైతం లెక్కచేయక ప్రజలు అధికసంఖ్యలో వచ్చారు. వచ్చిన భక్తులకు ఉదయం అల్పాహారంతో పాటు, మధ్యాహ్నం అన్నదానవసతిని దేవస్థాన అధి కారులు కల్పించారు. ప్రత్యేక దర్శనం 4737 మంది దర్శించుకోగా, రూ. 4,73,700, లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ. 2,004,25, అన్నదానంకు రూ. 6,08,989తో పాటు వివిధ పూజలు, తలనీలాలు, రూముల అద్దెలు కలిపి రూ. 14,95, 727 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు.

సంఘీభావ పాదయాత్రకు తరలిరావాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు సంఘీభావంగా కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ నెల 15న సంఘీభావ పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆ రోజు సాయంత్రం 3.30 గంటలకు కందుకూరు మండలం మోపాడులో బయలుదేరి, పట్టణంలోని స్వర్గీయ ఎన్‌టిఆర్ విగ్రహం వరకు సాగుతుందని, మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మడల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరశింహం శనివారం ప్రకటనలో కోరారు.

ప్రజల మనోభావాలను దెబ్బతీయొద్దు : సిపిఐ

ప్రజాశక్తి-నెల్లూరు రూరల్ : కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తుందని సిపిఐ, ముస్లిం మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం నగరంలో ర్యాలీని చేపట్టారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ సిరాజ్, ముస్లిం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జియా, ఎస్ డి పి ఐ రాష్ట్ర నాయకులు గని మాట్లాడారు. తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కేరళ స్టోరీ చిత్రాన్ని నిషేధించాయన్నారు. ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఈ సినిమాను నిషేధించకుండా ఎలా అనుమతించిందో అర్థం కావడం లేదన్నారు. జెఏసి రాష్ట్ర ఉపాధక్షుడు మౌలానా అబ్దుల్ అజీజ్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ షబ్బీర్, షానవాజ్, మున్నా, ఉమర్, మౌలానా ఖయుం, ఫైజుల్, అబిద్, మునవర్,మస్తాన్ వలి, షాకీర్, ముజాహిద్ ఉన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి -నెల్లూరు రూరల్ : నెల్లూరు నగరంలోని అవెన్యూస్ సీనియర్ సెకండరీ' స్కూలు పాఠశాల ఆవరణంలో వాలిబాల్ క్రీడా శిక్షణ తరగతులు గత కొన్ని రోజులుగా నిర్వహి స్తున్నారు. ఈ శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు వాలిబాల్ ఆటలో మెలుకువలు, క్రమశిక్షణ, స్నేహభావం వంటి లక్షణాలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా నెల్ క్యాస్ట్ సంస్థ డైరెక్టర్ , అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూలు వ్యవస్థాపకులు దివ్యారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణ చైతన్య శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికేట్ అందజేశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, వాలీ బాల్స్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. ఈ వాలీబాల్ వేసవి శిక్షణ తరగతులను అవెన్యూస్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీవెంకటాద్రి,ˊరీముల్లా ఎంతో చక్కగా నిర్వహించినారని వారికి భినందనలు తెలిపారు.

పోలీసుల తీరు దారుణం : టిడిపి

నెల్లూరు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కావలి పర్యటనకు సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి ప్రయత్నించిన బిజెపి నాయకులు మొగరాల సురేష్ పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గమని టిడిపి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఖండించారు.

మెకానికల్ విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి -కందుకూరు : ఐ-కాడ్ సర్టిఫికేషన్ కోర్సులో శిక్షణ పొందిన మెకానికల్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య శనివారం తెలిపారు. ప్రాథమిక స్థాయిలో డిజైన్‌తో పాటు సాఫ్ట్ వెర్ బేసిక్స్ ఈ కోర్సులో నేర్పిం చినట్లు మెకానికల్ విభాగం ఇన్‌ఛార్జి జి పున్నారావు వెల్లడించారు. ఆటోమొబైల్ రంగంలో టివిఎస్, లైలాండ్, హీరో హొండా తదితర వాహన కంపెనీల ఉద్యోగాల ఎంపికలో ఈ సర్టిఫికెట్‌కు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఉపాధి సాధనకు ముందు చూపు

ఉపాధి సాధనలో అన్ని రంగాల్లో పోటీ తీవ్ర తరమవుతున్న స్థితిలో ప్రత్యేక శిక్షణల ద్వారా ప్రకాశం విద్యార్థులను అగ్ర భాగాన నిలిపేందుకు ఆయా రంగాల్లో నైపుణ్య సంస్థలను, నిపుణులను ఎంపిక చేసి విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తున్నామని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య వెల్లడించారు. ఐ.కాడ్ శిక్షకులు, ఫ్రీ లాన్సర్ ఎన్ రవి రాజా, ప్రిన్సిపల్ సి హెచ్ రవికుమార్, ఇసీఇ శ్రీకాంత్, మెకానికల్ సీనియర్ లెక్చరర్ కె.సింగయ్య పాల్గొన్నారు.

టిడిపిలో నాలుగు కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి -కందుకూరు : మండలంలోని పెదమోపాడు గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాల వారు శనివారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో వారు టిడిపిలో చేరారు. నాగేశ్వరరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రస్తుత వైసిపి పాలన దారుణంగా ఉందని, గ్రామాల్లో అభివృద్ధి అన్నమాటే లేదని, తిరిగి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం బాగు పడుతుందనే ఉద్దేశ్యంతో టిడిపిలో చేరుతున్నట్లు పెదమోపాడు గ్రామానికి చెందిన బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బెల్లంకొండ సురేష్, తన్నీరు మహేంద్ర, యనమల మాలకొండయ్య తెలిపారు. అందరూ కలిసి పార్టీ అభివద్ధికి కషి చేయాలని నాగేశ్వరరావు వారికి సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు తోకల వెంకటేశ్వర్లు, మండల తెలుగు యువత అధ్యక్షులు రావుల రవి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బెల్లంకొండ సింగయ్య పాల్గొన్నారు.

'నాడు -నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని మాల కొండ్రాయునిపాలెం పంచాయతీ పరిధిలోని ముక్తేశ్వరం గ్రామంలో జరుగుతున్న అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులను, నాడు-నేడు పనులను ఎంపిడిఒ శేషుబాబు శనివారం పరిశీలిం చారు. ఈ సందర్భంగా పనులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం జరిగే సమయంలో నాణ్యత ప్రమాణలు పాటించాలని చెప్పారు. అనంతరం ఆయన ఎంపిపి స్కూల్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ సాగర్,హెచ్.ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

15 నుంచి నారాయణలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-నెల్లూరు రూరల్ : థైరాయిడ్ గ్రంధి సమస్య, రొమ్ము సంబంధిత సమస్యలతో బాధపడే వారి కోసం నారాయణ వైద్యశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి జూన్ 14వ తేది వరకు ఉచిత బ్రెస్ట్ క్లీనిక్ వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.హరిప్రసాద్ తెలిపారు. శనివారం నారాయణ వైద్యశాల మెడికల్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు.బి హరిప్రసాద్ మాట్లాడుతూ థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్న వారికి డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు లేకుండా రూ.2500 విలువ చేసే పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రొమ్ము సంబంధిత సమస్యలతో బాధపడేవారు డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు రూ.1500లు విలువ చేసే పరీక్షలు ఉచితంగా నిర్వహి స్తామన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ పథకంలో ఉచితంగా నిర్వహిస్తా మన్నారు. నారాయణ వైద్యశాల జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ వి.మహీధర్‌రెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్ కె.లక్ష్మి సంపత్, డాక్టర్ జి.వి. ప్రకాష్, డాక్టర్ వెంకట హరీష్ మాట్లాడుతూ శరీరంలో ముఖ్యమైన గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటన్నారు. వివరాలకు 9640100555, 7331170063 నెంబర్లకు సంప్రదించాలన్నారు.



'ఉపాధి' పరిరక్షణకు ఉద్యమించాలి

ప్రజాశక్తి - లింగసముద్రం : మోడీ ప్రభుత్వం 'ఉపాధి' హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న చర్యలను అడ్డు కునేందుకు ఉద్యమించాలని సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని విఆర్ కోట గ్రామంలో అడవిలో జరుగుతున్న ఓరవ పూడికతీత పని ప్రదేశానికి వెళ్లి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌లో ప్రతి ఏడాది రూ. కోట్ల మేర నిధులు కోత విధిస్తున్నాయన్నారు. ఏప్రిల్,మే నెలల్లో కూలీలకు ఇచ్చే సమ్మర్ అలవెన్స్ రద్దు చేశారని పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు గతంలో ఉన్న సౌకర్యాలను రద్దు చేసి ప్రభుత్వం కూలీలను దారుణంగా మోసం చేస్తుందన్నారు. ప్రతి సంవత్సరం బడ్జెట్‌లో రూ. 200 కోట్లు అదనంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. అందుకోసం ఈ నెల 15న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక సంఘం జిల్లా నాయకులు దువ్వూరు జాన్,డి.యం రాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివిబి కుమార్

15 నుంచి నాటక పోటీలు

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని పెదపవని గ్రామంలో ఉన్న భళేరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఈనెల 15వ తేదీ నుంచి 18 వరకు కీ.శే ఎం.రాఘవేంద్రరావు కళా పరిషత్ ఆధ్వర్యంలో ప్రథమ జాతీయ స్థాయి నాటక పోటీలు జరుగుతాయని అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు సిహెచ్ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు జరిగే ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కందు కూరు, కావలి ఎంఎల్‌ఎలు మానుగుంట మహీధర్‌రెడ్డి, ఆర్. ప్రతాప్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, తూమాటి మాధవరావు. కంచర్ల శ్రీకాంత్, కందుకూరు టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎం ఎల్‌ఎలు పోతుల రామారావు, దివి శివరాం, టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్, సినీనటులు శివబాలాజీ, మధుమిత దంపతులు, పాల్గొంటారని చెప్పారు.

సమస్యల పరిష్కారంపై పోరాడాలి

ప్రజాశక్తి - నెల్లూరు రూరల్ : ఊటుకూరు ప్రాంతంలోని శంకర్ నగర్ గిరిజన కాలనీలో శనివారం ఎన్ టి ఎఫ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఎన్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు పులి చెంచయ్య మాట్లాడుతూ 11వ తారీఖున విజయవాడలో రాష్ట్ర అధ్యక్షులు ఎం నవీన్ జిల్లా అధ్యక్షులు అందరికీ గిరిజనులు సమస్యలపై ఎన్ టి ఎఫ్ ఏ విధంగా నిబద్ధ తతో పని చేయాలో సూచించారు. ఇతర దేశాలలో స్థిరపడి గిరిజన బిడ్డల కోసం తన వంతు ఆర్థిక సహాయం చేస్తున్న గిరిజన ఆడపడుచు గజ్జల కష్ణవేణికి సన్మానించారు. ఎన్ టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమరగిరి దయాకర్ , చైర్మన్ దాసరి పోలయ్య , ఏకశిరి లోక్ సాయి శాలువాతో సన్మానించారు. జిల్లాలో ఉన్న గిరిజన ప్రధాన సమస్యలను పరిష్కరించడానికి ఎన్ టి ఎఫ్ ఏ విధంగా కషి చేయాలో చర్చించారు. తోటకూర శ్రీకాంత్ సాగర్ అల్లూరయ్య వెంకట శేషయ్య ఉన్నారు.

జిఒనెంబర్ 1 కొట్టివేతపై హర్షం

ప్రజాశక్తి-కొడవలూరు

జిఒ నెంబర్ 1 విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కొడవలూరులో టిడిపి మండల అధ్యక్షుడు అమరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో జిఒ 1 న్యాయస్థానం కొట్టివేసినందున ఆనందోత్సవాలలో టిడిపి నాయకులు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చీకట్లో ప్రవేశపెట్టిన జీవో ఒకటిని న్యాయస్థానం కొట్టివేసింది. జగన్మోహన్ రెడ్డికి దిమ్మతిరిగేలా న్యాయస్థానం తీర్పించిందని టిడిపి నాయకులు ఆనందోత్సవాలలో ఉన్నారు. రాష్ట్రంలో రహదారులపై అన్ని రకాల సభలు, సమావేశాలను నిషేధించే జీఓ 1ను హైకోర్టు ధర్మాసనం కొట్టేసింది. ఆ జీవో చెల్లుబాటు కాదని తేల్చి చెప్పింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంతకుమార్ మిశ్ర, జస్టిస్ డీవీఎస్ ఎస్ సోమయాజులుతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ మేరకు 43 పేజీల సంచలన తీర్పు ఇచ్చింది. పోలీసు చట్ట నిబంధనలను జీవో ఉందని స్పష్టం చేసింది. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్ర రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్ర, చెక్క మదన్మోహన్ రావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదరణ కేంద్రంలో భోజనం పంపిణీ

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం ముంగుమూరు రోడ్డు జాతీయ రహదారి పక్కన ఉన్న భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలో ఉన్న అనాథ బాలబాలికల వృద్ధులకు విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామి పాలెంకు చెందిన సిరితోటి రాజమ్మ 2వ వర్ధంతి సందర్భంగా శనివారం వారి కుటుంబ సభ్యులు భోజనం, స్వీట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి రావు మాట్లాడుతూ సిరితోటి రాజమ్మ కుటుంబ సభ్యులు వారి ఇంట్లో జరుగుతున్న కార్యాన్ని భవాని ఎడ్యుకేషనల్ సొసైటీ ఆదరణ కేంద్రంలోని వారితో పంచుకోవడం వారి మంచి మనసుకు నిదర్శనమన్నారు. మంచి మనసుతో ఆదరణ కేంద్రానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారందరికీ ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ దానియేలు, సిహెచ్ శ్యామ్‌సన్‌బాబు, సిహెచ్ ప్రభుదాసు, సుజన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

టిడిపితో పొత్తు శుభపరిణామం

ప్రజాశక్తి-ఉదయగిరి

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టిడిపితో పొత్తు శుభ పరిణామమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చంచలబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ టిడిపితో పొత్తుకు వెళదామని ప్రకటించడం స్వాగతిస్తున్నాం టిడిపి జనసేన పొత్తు రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతో అవసరమని భవిష్యత్తులో అరాచక పాలన పోవాలంటే రాష్ట్రం అన్ని రంగాలలో ముందుకు పోవాలన్న ప్రాజెక్టులు కావాలన్నా పరిశ్రమలు రావాలన్నా టిడిపి అధికారం రావడం ఎంతైనా అవసరం ఉందన్నారు. పవన్ కళ్యాణ్ మాటలు టిడిపితో ఎటువంటి షరతులు లేకుండా పొత్తుకు పోదామని ప్రకటించడం చరితాత్మక ఈ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలందరూ స్వాగతిస్తున్నారని కచ్చితంగా రాబోయేది తెలుగుదేశం, జనసేన ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చిన్ననాటి నుంచే గ్రంథాలయాలకు వెళ్లాలి

ప్రజాశక్తి-కొడవలూరు

చిన్న నాటి నుంచే గ్రంథాలయాలకు రావడం అలవరచుకోవాలని. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వెంకయ్య సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు శాఖ గ్రంథాలయంలో శనివారం చిన్నారులతో మెమరీ గేమ్ ఆడించడంతోపాటు ప్రతిజ్ఞ చేయించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి పాల్గొన్నారు.

పలుచోట్ల కళ్యాణ మహోత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని చుంచులూరులో చింతంరెడ్డి సిద్దారెడ్డి జయమ్మల ఆధ్వర్యంలో శనివారం సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, ఉత్సవ విగ్రహాలకు నూతనంగా తయారు చేయించిన వెండి కిరీటాలు, నామాలు యజ్ఞోప వేతం, అమ్మవారికి మాంగళ్య సమర్పణ, అనంతరం సీతారాముల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని వేడుకగా తిలకించి అన్నప్రసాదాలను స్వీకరించారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలోని శ్రీ సీతరామకళ్యాణ మహోత్సవ శనివారం అంగరంగ వైభవంగా వేద పండితుల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీవారి కళ్యాణ మహోత్సవ ఉభయకర్తలుగా బొడ్డు ప్రభాకర్ రెడ్డి సతీమణి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు శ్రీ వేదగిరి ఆంజనేయ వరప్రసాదాచార్యులు, వేదగిరి నరేష్ ఆచార్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వరికుంటపాడు : మండలంలోని తిమ్మారెడ్డిపల్లి ఎస్‌సి కాలనీలో గత 3రోజులుగా జరుగుతున్న ఉత్సవాలలో భాగంగా శనివారం అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణాన్ని వేదమంత్రోచ్చరణాల మధ్య ఘనంగా సర్పంచ్ మేడిద నారాయణమ్మ – వెంకటేశ్వర్లు దంపతుల ఆధ్వర్యంలో రాముల వారి కళ్యాణ్ ఉత్సవాన్ని నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణాలు, మేళతాళాల నడుమ కన్యాదానం, కంకణాల ధరింపు, జీలకర బెల్లం వంటి ఆచారాలను పాటిస్తూ పండితులు తాళిబొట్టును సీతమ్మ మెడలో వేసి కళ్యాణం నిర్వహించారు.

ప్రజాశక్తి-కొడవలూరు : దళితవాడలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవ... బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సీతారామ, లక్ష్మణ హనుమత్ మూలమంత్ర హోమం వేడుకగా నిర్వహించారు. బాలదాసులు అన్నదానం, పంజు సేవలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

ప్రజాశక్తి-నెల్లూరురూరల్ : జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణలు రోజురోజుకు ఆసక్తిదాయకంగా కనిపిస్తున్నాయి. ఇప్పటి వరకు వైసిపి గుర్తుతో ఎంఎల్ఎలుగా గెలుపొందిన రూరల్ ఎంఎల్ఎ, వెంకటగిరి ఎంఎల్ఎ, ఉదయగిరి ఎంఎల్ఎలు పార్టీ అధిష్టాన నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మాట్లాడటంతో పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పార్టీ అధినాయకులు నిర్ణయం తీసుకున్నారు. పార్టీ నాయకత్వం నుంచి ఉత్తర్వులు వెలువడిన వెంటనే రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వంపై ప్రత్యక్ష యుద్ధం ప్రకటించారు. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ తన గళాన్ని వినిపించారు. మరో ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి తనదైన శైలిలో ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. ఇక ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి వైసిపి నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడిన వెంటనే తన నెత్తిమీద ఉన్న పెద్ద భారాన్ని దించేసుకున్నట్లు హాయిగా ఉందంటూ గంభీరత్వాన్ని ప్రదర్శించారు. అంతటితో ఆగకుండా ఉదయగిరి నియోజకవర్గంలోని టిడిపి నేతలతో కలిసి సమావేశాలు నిర్వహించడం, తన రాజకీయ ప్రత్యర్థి అయిన కంభం విజయరామిరెడ్డిని కలవడం, బొల్లినేని రామారావుకు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే నేపథ్యం ఉన్నప్పటికీ ఇటీవల ఇద్దరు కలిసి నియోజకవర్గంలో తిరగడం సర్వత్రా ఆసక్తి నెలకొంది. కరోనా సమయంలో కుటుంబాలు కుటుంబాలు దెబ్బతిన్నాయి. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయి అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. అటువంటి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ఓ పథకాన్ని రూపొందించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు కోవిడ్ బాధిత కుటుంబాలకు అందజేసేందుకు ప్రభుత్వం ఒక ప్రణాళిక రూపొందించింది. ఆ ప్రణాళికను కొంత మంది వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు తమకు అనుకూలంగా చేసుకొని అక్రమ పద్ధతిలో తమ జేబులను నింపుకున్నారు. ఈ వ్యవహారం ఆనోటా ఈనోటా బహిర్గతం కావడం. ప్రతిపక్షాలు కథనాలు ప్రచురితం కావడంతో అక్రమ పద్ధతిలో జేబులు నింపుకున్న వారి కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి దుర్వినియోగం అయిన కోవిడ్ నిధులను రాబట్టేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, ప్రతిపక్ష పార్టీలు చేసే ఆందోళనలను అణిచివేసేందుకు దొడ్డిదారిన తీసుకొచ్చిన జిఒ నెంబరు ఒకటిని ప్రజాస్వామిక వాదులు, పక్ష పార్టీలు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 1 ప్రజావ్యతిరేకమైందని, ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపేందుకు, ప్రతిపక్ష పార్టీల ఉద్యమాలను చేసేందుకు ఒక పథకం ప్రకారం ప్రభుత్వం అణిచివేసేందుకు ఈ జిఒను విడుదల చేసిందని, ఈ జిఒ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమైందంటూ తీర్పు వెల్లడిచేయడంతో జిఒ నెంబరు ఒకటిని రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. చుక్కల భూముల పరిష్కారానికి దారి చూపే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కావలికి వచ్చారు. కావలి అభివృద్ధికి రూ.150కోట్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

వీక్షణం

నాణ్యమైన విద్యాకానుక కిట్లు అందజేయాలి

ప్రజాశక్తి-సీతారామపురం

విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కానుక కిట్లు నాణ్యమైనవిగా ఉండాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తెలిపారు. శనివారం మండలంలో ఆయన పర్యటించారు. ఆదర్శ పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను ఆయన పరిశీలించారు. విద్యా కానుక ద్వారా విద్యార్థులకు అందిస్తున్న యూనిఫారం, బ్యాగ్, నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్, షూస్ లాంటి ఏడు రకాల వస్తువులను ఆయన పరిశీలించారు. మండలానికి అందిన జీవీకే కిట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యాగులకు జిప్పులు సైతం సరిగా పడకపోవడం, కొన్ని జిప్పులు చిరిగిపోయి ఉండటం, బెల్టు 4 ఇంచులు సైజు తగ్గి ఉండడం, డిస్‌ప్లేలో ఉన్న యూనిఫారంకి సప్లయి అయిన యూనిఫారంకు మధ్య నాణ్యతను, కొలతలను పరిశీలించారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా నాణ్యమైన వస్తువులను విద్యార్థులకు అందించాలని జగనన్న విద్యా కానుక కిట్ వస్తువులను పంపిణీ చేస్తున్న సిబ్బందికి ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం బసినేనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా పాఠశాల యొక్క రూపురేఖలు మార్చాలని, విద్యార్థిని విద్యార్థులకు అందమైన, ఆహ్లాదకరమైన, వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యను అందిస్తేనే వారికి మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. ముఖ్యంగా నాడు-నేడు ద్వారా క్రీడా మైదానాలు, లైబ్రరీలు, మరుగుదొడ్లు, అందమైన తరగతి గదులు, బెంచీలు, కార్పొరేట్ పాఠశాల తరహాలో ప్రతి పేదింటి విద్యార్థిని విద్యార్థులకు వసతులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ గంగా భవాని, ఆర్‌జెడి సుబ్బారావు, ఎపిసి ఉషా రాణి, ఎంఇఒ మస్తాన్ వలీ, ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎం రెహమాన్, తదితరులున్నారు.

విద్యార్థి తరగతి గదులపై ఆగ్రహం

ప్రజాశక్తి-ఉదయగిరి : విద్యార్థులు తరగతి గదిలో ఆహ్లాదకరంగా ఉండాలని శిథిలావస్థ గదులలో బోధనపై సంబంధిత అధికారులపై రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని గడ్డవారిపల్లి స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజ్ హైస్కూళ్లను ఆయన పర్యటించారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు తరగతి గదులను ఆయన పరిశీలించి తరగతి గది నిర్మాణంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎఆర్‌ఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్ ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాకానుక ద్వారా విద్యార్థులకు అందిస్తున్న యూనిఫారం, బ్యాగ్, నోట్ బుక్స్, టెక్స్ట్ బుక్స్, బెల్ట్, షూస్ లాంటి ఏడు రకాల వస్తువులను ఆయన పరిశీలించారు. మండలానికి అందిన జీవీకే కిట్ల గురించి అధికారులను

సిబ్బందితో మాట్లాడుతున్న ప్రవీణ్‌ప్రకాష్

అడిగి తెలుసుకున్నారు. బ్యాగులకు జిప్పులు సైతం సరిగా పడకపోవడం, కొన్ని జిప్పులు చిరిగిపోయి ఉండటం, బెల్టు 4 ఇంచులు సైజు తగ్గి ఉండడం, డిస్‌ప్లేలో ఉన్న యూనిఫారంకి సప్లై అయిన యూనిఫారంకు మధ్య నాణ్యతను, కొలతలను పరిశీలించారు. ప్రభుత్వం చెబుతున్న విధంగా నాణ్యమైన వస్తువులను విద్యార్థులకు అందించాలని జగనన్న విద్యా కానుక కిట్ వస్తువులను పంపిణీ చేస్తున్న సిబ్బందికి ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. నాడు-నేడు ద్వారా పాఠశాల రూపురేఖలు మార్చాలని, విద్యార్థులకు అందమైన, ఆహ్లాదకరమైన, వాతావరణంలో ఉపాధ్యాయులు విద్యను అందిస్తేనే వారికి మెరుగైన విద్య అందుతుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులకు తమ ఫోన్ నెంబర్‌ను ఇవ్వాలని ప్రతి తల్లికి తాను ఫోన్ చేసి నేరుగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. ఇకనుండి తప్పిదాలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఇఒ గంగాభవాని, ఆర్‌జెడి సుబ్బారావు, ఎపిసి ఉషారాణి, ఎంఇఒ మస్తాన్ వలీ, ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎం రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-కోవూరు

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కమిటీ మెంబర్ సురేంద్ర మాట్లాడుతూ దేశం తరపున ప్రపంచ క్రీడాకారులతో పోటీపడి పథకాలను తీసుకొచ్చిన టువంటి మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళా రెజ్లర్లను పోలీసులు దుర్మార్గంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ ను వెంటనే అరెస్టు చేయాలని లేనిపక్షంలో అరెస్టు చేసే వరకు అనేక దఫాలుగా విద్యార్థులు, యువకులు, మహిళలతోఉద్యమాలను నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గండవరపు శేషయ్య, ఎస్‌కె బాబు, హరి, బుజ్జన్న, పెద్దన్న, మోహన్, మణి, సురేష్, విజయ్, హరి, ఆవాజ్ నాయకులు చాంద్ బాషా,. అప్రోచ్, హుమయున్, కాలేషా, ఖాదర్‌బాషా, పాల్గొన్నారు.

సిఎం సభలో వైసిపి హడావుడి

ప్రజాశక్తి-కావలి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మొట్టమొదటిసారి అధికారికంగా కావలికి వచ్చిన సందర్భంగా కావలి టౌన్‌లో కర్ఫ్యూ వాతావరణం, చెట్లను తొలగించడం, మహిళా పొదుపు గ్రూప్ వారిని బలవంతంగా తీసుకోని వచ్చి కూర్చోబెట్టడం, జనాలను తోలి వైసిపి నాయకులు హడావిడి చెయ్యడం ప్రజలు గమనిస్తున్నారని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ పేర్కొన్నారు. ముఖ్యంగా సిఎం జగన్మోహన్ రెడ్డి చుక్కల భూములను పట్టా భూములుగా మార్చిన 22/ఏ(1)ఈ నుండి డీనోటిఫైలో మొత్తం చుక్కల భూమిని క్లియర్ చేసినట్లు చెప్పినవి పూర్తి అబద్ధాలన్నారు. ఉదాహరణకు నెల్లూరు జిల్లాల్లో సుమారు 77వేల ఎకరాల చుక్కలభూమి ఉంటే కేవలం సుమారు 43వేల ఎకరాలు అంటే కేవలం 60శాతం భూములకు మాత్రమే క్లియరెన్స్ ఇచ్చినట్లు తెలిపారు. కానీ జిల్లా కలెక్టర్ రెవెన్యూ వాళ్లకు కేవలం 6 నుండి 7వేల ఎకరాలకు మాత్రమే క్లియరెన్స్ ఇచ్చినట్లు తమ దగ్గర సమాచారం ఉందన్నారు. అంటే కేవలం 20శాతం భూములకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. దీనిపై జనసేన పార్టీ తరుపున ఇంకా పూర్తి సమాచారం సేకరించి ఆధారాలతో సహా త్వరలో అధిష్ఠానం ప్రజల ముందు ఉంచబోతుందని తెలిపారు. కావలికి వరాల జల్లు రూ.150కోట్లు కుమ్మరించినట్లు బిల్డప్ ఇచ్చుకునే వైసిపి వాళ్లు తుమ్మలపెంట రోడ్డుకు, ముసునూరు డబుల్ రోడ్డు అని మధ్యలోనే ఆపేసి ప్రజలకు నరకం చూపిస్తున్నారన్నారు. అలానే కలుగొలమ్మ వద్ద ఫ్లైఓవర్‌కు అతీ గతీ లేదన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కావలిలో ఎంఎల్ఎ, వాళ్ల బినామీలు దోచుకోవడం దాచుకోవడం తప్ప కావలి కనకపట్నం చేస్తానని చెప్పుకోనే ప్రతాప్ కుమార్ రెడ్డికి రెండు సార్లు అంటే 10 ఏళ్లు అధికారం ఇచ్చిన ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉందన్నారు.

యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి-మర్రిపాడు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజుల మైలురాయి చేరుకుంటున్న సందర్భంగా జాతీయ టిడిపి పిలుపు మేరకు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గూటూరు మురళీకన్నబాబు ఆధ్వర్యంలో జరిగే సంఘీభావం యాత్రను జయప్రదం చేయాలని మండల అధ్యక్షులు ఆరికట్ల జనార్ధన్ నాయుడు పిలుపునిచ్చారు. సంఘీభావ పాదయాత్ర సోమవారం మధ్యాహ్నం 3గంటలకు ఆత్మకూరు మండలం దేపూరు గ్రామం నుండి అశ్వినీపురం, నువ్వూరుపాడు గ్రామాల మీదుగా ఆత్మకూరు పట్టణంలోని బస్టాండ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు సంఘీభావ యాత్ర జరుగుతుందన్నారు. కనుక టిడిపి కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు దేపూరు గ్రామం చేరుకోవాలన్నారు. ఈ పాదయాత్రకు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, ఎన్‌టిఆర్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కర్ణాటక ఎన్నికలు బిజెపికి చెంపపెట్టు

ప్రజాశక్తి-బిట్రగుంట

కర్ణాటక రాష్ట్ర ప్రజలు అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి లేళ్లపల్లి సురేష్‌బాబు పేర్కొన్నారు. కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినందుకు బిట్రగుంట ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో కావలి పట్టణ అధ్యక్షులు అనిల్‌మాల్ శెట్టి వాసు పాల్గొని వారు మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడానికి సహకరించిన ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియా మిత్రులకు, పార్టీ గెలుపునకు విశేషంగా కృషిచేసిన కార్యకర్తలకు నాయకులకు, ఓట్లు వేసి గెలిపించిన కర్ణాటక రాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ఆదాని గ్రూప్ కార్పొరేట్ సంస్థలకు బిజెపి ప్రభుత్వం కొంగు కాస్తుందని, రాబోవు ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తారన్నారు.

ప్రజాశక్తి-సీతారామపురం : కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ సాధించిన

విజయంపై మండల కాంగ్రెస్ నేతలు హర్షాన్ని వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ కానాల హాజరత్తయ్య ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి వ్యతిరేక విధానాలకు ప్రజలు విసుగు చెందారని దేశంలో మార్పును ప్రజలు కోరుతున్నారని దాని తొలి అడుగు ప్రయత్నమే కర్ణాటక ఎన్నికలలో కాంగ్రెస్ గెలిచిందని తెలిపారు. ఇదే తరహాలో రాబోయే 2024 ఎన్నికలలో యుపిఎ కూటమి అధికారంలోకి వస్తుందని నరేంద్ర మోడీ ప్రభుత్వం గద్దె దిగుతుందని ఆయన జోస్యంచెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కానాల ఖాజావలి, అమీర్ బాబు మోష, అమీల పోగు బాలయ్య, అమీల పోగు యోబు, కె ఇశ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉదయగిరి : మోడీ ప్రభుత్వానికి కర్ణాటక ఎన్నికలతో నూకలుచెల్లాయని నియోజకవర్గం ఇన్‌ఛార్జి పిసిసి సభ్యులు

దుద్దుకూరు రమేష్ నాయుడు పేర్కొన్నారు. శనివారం స్థానిక బస్టాండ్ సెంటర్లో కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘనవిజయం సాధించడంపై బాణసంచాలు పేర్చి కేకులు కట్ చేసి ఘనంగా పండుగ వాతావరణం వేడుకలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో 140 స్థానాలు పైగా కాంగ్రెస్‌పార్టీ విజయం సాధించడం సంతోషదాయకమన్నారు. జరగబోయే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్లో రాహుల్ గాంధీ ప్రధాని అవడం ఖాయమని ఈ ఎన్నికలతో మోడీకి కర్ణాటక ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధిక మెజార్టీ సాధిస్తుందని తెలిపారు. రాహుల్ గాంధీ జోడోయాత్ర, జైత్రయాత్ర ఈ ఘన విజయానికి నిదర్శనమని తెలుగు రాష్ట్రంలో కూడా రాహుల్ గాంధీ ఆశీర్వదిస్తున్నారన్నారు. ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కర్ణాటక ఘన విజయంపై బస్టాండ్ సెంటర్లో భావన సంచారాలు పేల్చడం సంతోషకరమని రమేష్ నాయుడుకు కితాబిచ్చారు. మాజీ ఎంపిపి బాలయ్య, చంద్రమౌళేశ్వర్ రెడ్డి, బకీరు హాజరత్తయ్య, ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రివి మోసపూరిత హామీలు

ప్రజాశక్తి-కావలి

మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డివి మోసపూరిత వాగ్దానాలు అని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు పేర్కొన్నారు. నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఆయన శనివారం పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ రాష్ట్రాన్ని పాలించిన ఎంతో మంది ముఖ్యమంత్రులను చూశామనీ, ఇటువంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. తాను అమలు పరుస్తున్న జిఒలను కోర్టు వారు తిరస్కరిస్తుంటేనే ముఖ్యమంత్రి ఆలోచన విధానం అర్థమవుతుందని తెలిపారు. ప్రజలు జగన్ పరిపాలన పోయి చంద్రబాబునాయుడు పరిపాలన రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావలికి వచ్చి రూ.150 కోట్లు కావలి అభివృద్ధికి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాల కాలంలో తుమ్మలపెంట రోడ్డు, బట్లదిన్నె రోడ్డు, తాళ్లపాలెం రోడ్డు పనులు చేయలేకపోయి, ఈరోజు మోసపూరిత వాగ్దానాలు ప్రజలకు ఇవ్వవద్దని హితవు పలికారు. ముఖ్యమంత్రి వచ్చిన రోజు గ్రావెల్ అవినీతి గురించి పత్రికల్లో వచ్చింది చూడలేదా.. అని ప్రశ్నించారు. కావలిలో గ్రావెల్ మాఫియా ఎవరంటే చిన్నపిల్లాడిని అడిగిన ఎంఎల్ఎ పేరు చెబుతారని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందే టిడిపి అని... ఆ విషయాన్ని గుర్తుంచుకొని వైసిపి నాయకులు మాట్లాడాలని తెలియజేశారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కావలి పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, మైనారిటీ రాష్ట్ర విభాగం కార్యనిర్వాక కార్యదర్శి షేక్ మస్తాన్, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు కోట రమేష్, పట్టణ మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్ రహీం, 31వ వార్డు ఇన్‌ఛార్జి మంచాల ప్రసాద్, కోవూరు వెంకటనారాయణ పాల్గొన్నారు.

కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

E.P.No. 10/2011

O.S.No. 280/2004

స్వర్ణ ప్రకాశరావు - D.H.R./వాది

Vs

చిమ్మిరి కోటేశ్వర రావు - J.D.R./ప్రతివాది

వేలం ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా J.D.R. తాలుకు యీ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తులను పై డిక్రీ బాకీ రాబట్టుట కొరకు శ్రీ కోర్టు వారు **తే16-6-2023** దిన తమ కోర్టు ఆవరణలో బహిరంగ వేలం వేయుదురు. కాన యీ క్రింది షెడ్యూలు ఆస్తులు కొనుగోలు చేయదలచిన వారు పై తేదీన **ఉదయం 10.30 గంటల** నుంచి హాజరై కోర్టు వారు జరిపే వేలంలో పాల్గొని ఈ క్రింది ఆస్తులు కొనుగోలు చేసుకోవచ్చునని యిందు మూలముగా తెలుపడమైనది.

వేలం షెడ్యూలు

Item No:1: Prakasam District - Singarayakonda Sub - Registration - Ulavapadu Mandal - Mannetikota village - Garden land in Survey No. 155 - an extent of Ac 1-62 cents bounded' by:- **East:** Land of Katragadda Venkateswarlu, **South:** land of Chimmiri Bhavani Sankar, **West:** Land 'of Pandilla Malakondaiah, **North:** Land of Pandilla Nageswara Rao, With in the above said boundaries there is a "Sapota'; Garden and where in the J.D.R. has got undivided 4/9 th share i.e. an extent of Ac 0-72 cents.

Value: Rs 15,000/-
Market Value : 8820/-

1tem No:2: Prakasam -District - . Singarayakonda Sub - Registration - Ulavapadu Mandal, Mannetikota village - Garden. land in Survey No. 161 - an extent of Ac 0-37 cents **bounded by:- Eas:** Larid of Ammanbrolu Sudhakar **South:** Land of Chimiri Bhavani Sankar, **West:** Land of Chimmiri Rudraiah, **North:** Land of Chennareddy Ramaiah, With in the above said boundaries there is a "Sapota" garden where in the J.D.R. has. got undivided 4/9th share i.e. an extent of Ac 0-16 cents.

Value: Rs 20,000/-
Market Value : 1960/-

Item No:3: Prakasam District - Singarayakonda Sub - Registration - Ulavapadu Mamdal, Mannetikota village - Garden lands in Survey No.s 3, 4/2 and 6 - ·an extent of Ac 0-68 cents, Ac 0-48 cents and Ac 0-19 cents totaling an extent of Ac 1-35 cents as co.ntiguous plot bounded by:- **East:** Kareti village boundary, **South:** Land of Kakumani Anuradha, **West:** Land of Subbamma, **North:** Land of Chimmirl Bhavani Sankar With in the above said boundaries there is. a 'Sapota' garden where in the· J.D.R. has got undivided 4/9 th share i.e. an extent of Ac 0-60 cents.

Value: Rs 60,000/-
Market Value : 7350/-

(By Order)
Ch. Hari Krishna
Advocate for D.H.R.

రైతు బాంధవుడు జగన్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-కోవూరు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

దశాబ్దాల చుక్కల భూముల సమస్యను శాశ్వత పరిష్కారం చేయడం ద్వారా రైతుల గుండెల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణం లోని పెళ్లకూరు కాలనీలో నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా నాడు వైఎస్ఆర్ నిలిచారని తండ్రికి తగ్గ తనయుడిలా నేడు జగన్ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. చుక్కల భూముల సమస్యను పరిష్కరించి రైతు బాంధవుడిగా జగన్ చరిత్ర లో నిలిచిపోయారన్నారు. రెండు లక్షల పై చిలుకు ఎకరాల భూములకు నేడు సంపూర్ణ యాజమాన్య రెవెన్యూ హక్కులను రైతులకు సిఎం ప్రసాదించారన్నారు. కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు మండలం లో 582 ఎకరాలు, విడవలూరు మండలంలో 1687 ఎకరాలు, కోవూరు మండలం లో 50 ఎకరాలు, బుచ్చిరెడ్డి పాలెం లో 230 ఎకరాలు, ఇందుకూరుపేట మండలం లో 124 ఎకరాలు నిషేధిత 22 ఏ నుంచి తొలిగించి రైతులకు సంపూర్ణ రెవెన్యూ హక్కులు అందించడం జరిగిందన్నారు. రైతు దేశానికి వెన్నెముక అని వేదికలెక్కి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చే ఏ ముఖ్యమంత్రి చేయని గట్టి మేలు జగన్ రైతులకు చేశారన్నారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి, పచ్చిపాల రాధాకష్ణ రెడ్డి, నలుబోలు సుబ్బారెడ్డి, రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, కాటంరెడ్డి దినేష్ రెడ్డి, తహశీల్దార్ పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీపీ పార్వతి, సర్పంచ్ యాకసిరి విజయ, శివుని నరసింహులు రెడ్డి, అనూప్ రెడ్డి, కిషోర్ సింగ్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-ఉదయగిరి

కేసులు పరిష్కారానికి రాజీయే మార్గం అని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి జె.అంజయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మెగా లోక్‌అదాలత్‌లో భాగంగా కోర్టు పరిధిలోని ఉదయగిరి, సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, మర్రిపాడు, వింజమూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 69 కేసులు, 413 పిట్టి కేసులు పరిష్కారమైనట్లు జడ్జి తెలిపారు. క్షణికావేశం జరిగే తప్పిదాలు సరైన పద్ధతి కాదని ప్రతిఒక్కరూ శాంతి పూరితమైన వాతావరణంలో మెలగాలని ఆయన కక్షదారులకు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామారావు షరీఫ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

సీతారామపుంరలో రాజకీయంపై చర్చ

ప్రజాశక్తి-సీతారామపురం :



మండలానికి సంబంధించిన రాజకీయ పరిస్థితులపై ఉదయగిరి వైసిపి నియోజకవర్గ పరిశీలకుడు మెట్టుకూరి ధనుంజయ రెడ్డితో శనివారం రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్, వైసిపి మండల సీనియర్ నాయకుడు పిసి అల్లూరు రాజు చర్చించారు. శనివారం దుత్తలూరు కేంద్రంగా నియోజకవర్గ వైసిపి నాయకులతో మెట్టుకూరి ధనుంజయరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీతారామపురం మండలానికి చెందిన వైసిపి సీనియర్ నాయకుడు పిసి అల్లూరు రాజు పాల్గొని ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం పేద ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను స్థానిక నాయకులు తెలుసుకుంటూ పథకాల లబ్ధి అందేలా చర్యలు తీసుకొని రాబోయే ఎన్నికలలో మరోసారి వైసిపి ప్రభుత్వాన్ని గెలిపించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.

బ్రిడ్జి అభివృద్ధి మరచిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి-కావలి

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కావలికి వచ్చిన సందర్భంగా అభివృద్ధి పనులకు నిధులు అడిగిన కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అసంపూర్తిగా ఉన్న వైకుంఠపురంలోని పెద్దపవని బ్రిడ్జి అభివృద్ధి గురించి అడగక పోవడం బాధాకరమని జనసేన అధికార ప్రతినిధి మన్నెపల్లి రిషికేష్ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నోసార్లు జనసేన పార్టీ వైకుంటపురం బ్రిడ్జి సమస్యపై ఎన్నో పోరాటాలు చేసిందని కావలి ఎంఎల్ఎకు వైకుంటపురం ప్రజలపై ప్రేమ లేదని తేటతెల్లమయిందన్నారు. గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో వైకుంటపురంలో తిరిగిన ఎంఎల్ఎ వైకుంటపురం బ్రిడ్జిని వెంటనే పూర్తి చేస్తానని చెప్పటం ప్రజలను మోసం చేసినట్లే అని జనసేన పార్టీ భావిస్తుందన్నారు. దీనిపై రాబోయే రోజుల్లో ప్రజలకు అర్థమైయే విధంగా జనసేన పార్టీ పోరాటం ఉధృతం చేస్తుందని జనసెన నాయకుడు మన్నెపల్లి రిషికేశ్ తెలియజేశారు. సిఎం కావలి వచ్చినప్పుడు కావలి సమస్యలు చెప్పుకోలేని అసమర్ధ ఎంఎల్ఎ ఉండడం మన కర్మ అని దుయ్యబట్టారు.